


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

4

(జూలై 11, 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"మనం ఎక్కదలచిన రైలు ఒక్క జీవితకాలం లేటు" అన్నాడు ఆరుద్ర కవి చంద్రుడు. ఇందులో ఎంతో వేదాంతం ఉంది. ఎంతో జీవిత సత్యం దాగి ఉంది.

'జీవిత కాలం లేటు' అనడం బాగుంది. పై జన్మలోనూ మాత్రం ఆ రైలు ఎక్కగలమని ఎలా చెప్పగలం! ఈ జీవి ఎక్కడో - ఆ రైలెక్కడో!.. అసలు పుడతాడో లేదో! పుడితే ఏ రైలు స్టేషను దగ్గిర పుడతాడో? అక్కడికే రైలు వస్తుందో ....

పూర్వం సర్కస్ రైళ్ళు కొన్నివస్తూ ఉండేవి. అందులోనూ మానవులతోపాటు మృగాలు వగైరాలు కూడా ప్రయాణం చేస్తూ ఉండేవి. అలాటి రైలన్నా అందుతుందో లేదో. ఎవరు చెప్పగలరు! ఈ జన్మలో మాత్రం రైలు తప్పిపోవడం నిజం.

మానవ కోటిలో రైలు తప్పిన వాళ్ళూ, బస్సు తప్పినవాళ్ళూ - చివరకు రెండెడ్లు బళ్ళు తప్పినవారూ ఎంతమందో ఉంటారు. ఎవడి కాళ్ళమీద వాడు నడిచిపోకుండా 'రైళ్ళు' వగైరా లెక్కడం కోసం తాపత్రయపడటమే తప్పు.. ఆశలు లేకపోతే ఎలాటి ముప్పూ లేదు. పొట్టకూటికి ఆశపడేవారికి ఇలాటి తిప్పలు తక్కువ. కడుపునిండిన వారికి ఏవో రైళ్ళు ఎక్కాలనీ, ఎక్కడెక్కడికో ప్రయాణాలు చెయ్యాలనీ ఆశ!..

*"ముందుగానే వచ్చింది ముసలితనం!... ఎందుకనో!!...."*

మా ఊర్రిప్రక్క ఒక పెద్ద ఆసామీ ఉండేవాడు. అప్పటి ఆసాములకందరికీ పెద్ద పెద్ద మీసాలుండేవి. ముంచేతికి మురుగులుండేవి. వెండి మొలత్రాడుండేది. రొంటిన పొడుంకాయ ఉండేది. చేతిలో వెదురుబెత్తం ఉండేది. అదీ ఆసామి స్వరూపం.

బంగారం మూటగట్టుకునేవాడు. శృంగారం బయట పెట్టుకునే వాడు. దశకంఠుడి లాగా పదితలలు లేకపోయినా ఆడవాళ్ళు కనపడితే ఇరవై కళ్ళతో చూసేవాడు. వాళ్ళ నవ్వులు వినాలని ఇరవై చెవులూ చేటంత చేసుకునేవాడు.

నడివయస్సు దాటగానే నడుం వంగిపోయింది. బెత్తాం పోయి లావుపాటి పన్నుకర్ర నెగ్గించుకుంటూ వచ్చాడు. హఠాత్తుగా పలుకుబడి తగ్గింది. అరుపులు మిగిలినాయి గెలుపులు పోయి.

అప్పుడప్పుడూ - అరుగుమీద స్థంభానికి జార్లగిలబడి కూర్చుని "ముందుగానే వచ్చింది నాకీ ముసలితనం... ఎందుకనో!" అనుకుని దిగులు పడుతూ ఉండేవాడు. అతగాడికి - ఎన్ని కోర్కెలున్నాయో ఎంత పాపం చేయదలచింది మిగిలిపోయిందో!. 'పడుచుతనపు' రైలులో నుంచి, కనిపించని టిక్కెట్టు కలెక్టర్ హఠాత్తుగా దింపేసినట్లయింది ఆయన పని.

ఏళ్ళు గడిస్తే వచ్చే ముసలితనం వేరు - కీళ్ళు తలిస్తే వచ్చే వృద్ధాప్యం వేరు - మొదటి ముసలితనంలో మోసం లేదు. రెండోదాంట్లో - మోసం, ఆయాసం, విషాద రంగ ప్రవేశం ఇత్యాదులన్నీ ఉంటాయి. ఆ ఆసామి అలాటి వృద్ధుడు.

*"అరవై దాటినా అనుకున్నది కాలేదు"*

మా ఊళ్ళో ఎదురు బొదురు రైతులిద్దరికి ఎందుకో చెప్పరాని పగ ఏర్పడింది. రెండూ పచ్చటి సంసారాలే! ఒకరింటిమీద ఒకరు చిచ్చులు విరజిమ్మడం ప్రారంభించారు. ఒకరికి నష్టం వస్తే రెండోవారికి పండగ. ఇలా సంవత్సరం పొడవునా ఎదుటివారి దండగలను బట్టి 'పండుగలు' చేసుకుంటూ ఉండేవారు.

ఇద్దరి ఆశయం ఒకటే - రెండోవారికి అన్నం నీళ్ళు లేకుండా పోవాలి. వాళ్ళ ఇంటి స్థలంలో జిల్లేళ్ళు మొలవాలి. ఇదే కోరిక. ఈ ఫలితాల కోసం ఇద్దరూ శాయశక్తులా కృషి చేశారు. ఎన్నో విషపు గాలులు విసురుకున్నారు. ఆస్తిపాస్తులను లంకా దహనం చేసుకుంటూ వచ్చారు.

అయినా పూర్తిగా నాశనం కాలేదిద్దరూ. అంతలో ఒకాయనకు విసుగుపుట్టింది. షష్టిపూర్తి కాలేదు. ఇతర విషయాలన్నీ మరచిపోయాడు. విరోధి నాశనమొక్కటే మనసులో పెట్టుకున్నాడు. ఆయువు తీరిపోతుంది - ఇంకా ఎప్పుడు నా అభీష్టం తీరదని విలపించడం ప్రారంభించాడు. చిలికి చిలికి చివరకు మరణించాడు.. ఏ లోకానికి పోయాడో, ఏమి ఆలోచిస్తున్నాడో!...

అదేం విచిత్రమో! యాభై దాటినా ఇంకా చాలాకాలం ఉంటాం - అనుకున్నది సాధించేందుకు చాలా వ్యవధి ఉంది అని ధైర్యంగా ఉంటారు. అరవై దగ్గరకి పోగానే - "అనుకున్న పనులు కాలేదు - ఆయువు తరిగిపోతోంది" అనే దిగులు పట్టుకుంటుంది పాపం.

ఏ ఉద్యోగంలోనో ఉండి... జీతం రాళ్ళు బండెడు సంపాదించుకుంటున్నవాళ్ళు - "నాకు వయసు మళ్ళింది గాని - నా మేధస్సు మామూలుగానే ఉంది. పైగా ఇంకా ఎక్కువైంది. ఈ లోకం నుంచి నిష్క్రమించేదాకా పదవి నుంచి నిష్క్రమించక్కరలేదు" అని డంబాలు చెప్పుకుంటూ.

*డంబాలు చెబుతుండగానే డింగీ ఒడ్డుకు తోస్తారు*

పసతప్పిన వాళ్ళ పలుకులు చల్లారిన వసరులో బియ్యం పోసినట్లవుతాయి. పొంగు వస్తుందా! గింజ ఉడుకుతుందా! పాపం చాలామందికి మంచంలో పడుకుని మరఫిరంగులు పేల్చాలని ఉంటుంది. కంచం మంచందాకా లాగితేనేగాని - ఆరగించలేని తరుణంలో.. కూడా మల్లయుద్ధం, చేద్దామని మనసుపడుతూ ఉంటారు.

రంగులు పడవలాగా నడిచే జీవితం - డింగీలాగా మారిపోయిందనే సత్యం గుర్తించరు. దాంతోనే సముద్రంలో ఈదాలనుకుంటారు. కాని ఎవరో చూచి ఆ డింగీని ఒడ్డుకు తోస్తారు... ఆ తర్వాత అడ్డం పెంచుకుని తలదించుకుని కూర్చోవలసిందే!

వెనుకటికి ఒకామె అందిట - "మావారు మరో రెండు సంవత్సరాలు బ్రతికినట్లుంటే కోటీశ్వరులయ్యేవారుట... ఏడాదికి లక్షచొప్పున సంపాదించేవారుట... ఏడూ అంతస్థుల మేడ కట్టేవారట... అయిదారు కార్లు కొనేవారుట ఆయనెలా ఉండేవారో! నేనెలా ఉండేదాన్నో!

'కొద్దిలో తప్పిపోయింది అదృష్టమంతా. ఆయన చక్రం మొన్న ఒకాయనకు చూపిస్తే ఈ వ్యక్తి బ్రతికినప్పటికంటె పోయిన తర్వాత గ్రహబలం చాలా బాగుంది. మంచి ఉచ్చస్థితిలో ఉంది. కాస్త ముందుగా పోవడం వల్ల పొందవలసిన సిరిసంపొందలేకపోయాడ'ని చెప్పాడు.

నేను కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంటే ఆయన నాకంటె ఎక్కువగా దుఃఖించటం ప్రారంభించాడు. తర్వాత అడిగితే చెప్పాడు - ఆయన బ్రతికి ఉంటే నాకీ జ్యోతిష్యం చెప్పినప్పుడు ఎలాటి గౌరవం చేసేవాడో! ఆయన పోకముందే నేను మీ ఇంటికి రావలసింది అన్నాడు. " ఆయన విచారానికి కారణం అది పాపం!

ప్రతివాడు తన బ్రతుకు నావలో బంగారు స్థంభాలు నిలబెట్టి - వాటికి పట్టు తెరచాపలెత్తి - పల్లెపాటలు పాడుకుంటూ విజయశంఖాలు ఊదుకుంటూ పయనం సాగించాలనే ఉంటుంది. కాని ఆశాపరులకు ఎలాటి ఫలితాలు దక్కకుండానే ఏ రూపంలోనూ కలలు నిజం కాకముందే డింగీలు ఒడ్డుకు చేరుతూ ఉంటాయి...

*"అది ముందుపుట్టి ఇది తర్వాత పుడితే.. అహహా!"*

చాలామందికి మరదళ్ళమీద చనువూ సరసం ఏర్పడుతూ ఉంటాయి. పూర్వం కాపరానికి రాకముందు ఆడపిల్లలు భర్తలతో మాట్లాడేవారుకాదు. ఈ లోపల అల్లుడు అత్తవారింటికి వెడితే - కాలక్షేపం కోసం మరదళ్ళతో, బావమరదులతో పరిహాసాలాడుతూ ఉండేవారు. మరదళ్ళ చిలిపితనం బావలకు పన్నీటి జల్లుగా ఉండేది.

ఒకానొక బుద్ధిమంతుడికి మరదలు అందగత్తె కావడం వల్ల - ఆ చూపు అలాగే నిలిచి పోయిందా అమ్మాయి మీద. ఆయన భార్య కాపరానికి వచ్చింది - ఇద్దరు బిడ్డల తల్లికూడా అయింది. ఎంతసేపు ఆయనగారు భార్యను మరదలితో పోల్చి చుసుకునేవాడు.

అలాటి సందర్భాలలో తాను తొందరపడి పెళ్ళిచేసుకున్నాననిపించేది. కాని పెళ్ళికాకుండా ఎన్నాళ్ళుంటాడు..? పోనీ మరదలు ముందు పుట్టి తన భార్య తర్వాత పుట్టినా బాగుండేదనిపించేది. అప్పుడు మరదలే భార్య అయ్యేదనే ఆశ ఆయనలో మెదిలేది.

ఎపుడు మరదల్ని చూచినా, తలుచుకున్నా ఈ బాధ మనస్సులో ముల్లులాగా గ్రుచ్చుకునేది. అందువల్ల మనశ్శాంతికోసం 'అది ముందుపుట్టి - ఇది తర్వాత పుడితేనా అహహా! జీవితం ఎంత హాయిగా ఉండేది, ఆ రంభను తరుముతూ మా సావిట్లో కొయ్యి స్థంభాల చుట్టూ దాగుడుమూతలాడేవాణ్ణి' అనుకునేవాడు. పాపం ఆయనకు.. రైలు జీవితం లేటు -

*"దడికట్టించి పోయాడు... గుడికట్టించాలి - ఎలాగైనా'*

ఒకసారి బంధువుల ఊరికివెళ్ళాను. అపుడు ఆంధ్రప్రభలో భద్రాద్రిరామాలయ పునరుద్ధరణకు విరాళాల వివరాలు ప్రకటిస్తున్నారు. నేను మా బంధువులతో ఆ విషయం మాట్లాడుతుండగా ఒక పెద్ద మనిషి ఆయనగారు చందాల విషయం విని ఎంతో చింతా క్రాంతుడయ్యాడు.

"ఏమిటి మీరలా ఖిన్నులవుతున్నారు? " అన్నాను. ఆయన మనస్సు సరిచేసుకుని "ఏం లేదు. మా నాన్నగారు గుడికట్టించాలని ఎంతో ప్రయత్నించారు. స్థలం నిర్ణయించారు. దాని చుట్టూ దడి కట్టించారు వెంటనే గుడికోసం ప్రయత్నం ప్రారంభించారు. చందాలు ఆ రాముడే తెస్తాడనుకున్నారు. రోజూ దడి దగ్గరికి వెళ్ళి "రామా! ఎప్పుడు కట్టిస్తావు గుడి?" అంటూ ఉండేవారు. అంటూ అంటూనే పోయారు. దడికూడా పడిపోయింది తర్వాత" అన్నారు.

"మీరు పూనుకుంటారా?" అన్నాను.

"పూనుకోవడం ఎంతసేపు! అందులో పుణ్యకార్యం! కాని ధర్మాత్ములు ముందుకు రావడంలేదు... ప్రస్తుతం ఆ స్థలంలో ఒక స్థంభం పాతి - ఇది రామాలయ స్థలం' అని బోర్డు కట్టాలి" అన్నాడు.

"అక్కడో గంగాళం కూడా పెట్టండి. విరాళాలు వేసిపోతూ ఉంటారు. చిన్న చిన్నవైతే లాభం లేదు. " అన్నాడు మా ప్రక్కన ఉన్నాయన.

Comment on this article..